# విఆర్ఎస్ అమలు బిఎస్ఎన్ఎల్‌కు మరియు ఉద్యోగులకు ఇరువురికీ ప్రమాదమే

బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్‌తో 20.9.2011న జరిగిన చర్చలలో వాలంటరీ రిటైర్‌మెంటు స్కీము అమలుపై మేనేజ్‌మెంట్ తన ప్రతిపాదనల్ని తెలియజేసింది. దీనిపై జాయింట్ యాక్షన్ కమిటీ మరియు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ విఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించాయి. విఆర్ఎస్ అమలు ఏ రకంగా ఉద్యోగులకు మరియు బిఎస్ఎన్ఎల్‌కు నష్టం కలిగిస్తుందో ఈ క్రింది కారణాలు తెలియజేస్తాయి.

### 1. వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీము విఫలమైన ప్రక్రియ

కంపెనీ నష్టాలకు ఉద్యోగుల వేతన బిల్లు పెరిగిపోవడమే కారణమనీ, కనుక ఇందుకు ఉద్యోగులే కారణమనీ పేర్కొనడం తప్ప విఆర్ఎస్ విధానంలో కొత్తదనమేమీ లేదు. ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తే ఖర్చు తగ్గుతుందనీ, కనుక నష్టాలు తగ్గి లాభాలు పెరుగుతాయన్న భ్రమని విఆర్ఎస్ పథకం కల్గిస్తోంది. వాస్తవానికి మూడు పర్యాయాలు ఎంటిఎన్ఎల్‌లో విఆర్ఎస్ అమలైనా, ఎంటిఎన్ఎల్ ఇంకా నష్టాలలోనే నడుస్తోంది. కనుక విఆర్ఎస్ అమలు ఒక చెడు సంప్రదాయం మరియు ఆచరణలో వైఫల్యం చెందిన పథకం.

### 2. భారీగా లక్షమంది ఉద్యోగులను సర్వీసు నుండి తొలగించే కుట్ర

ఎంటిఎన్ఎల్‌లో కొద్ది సంఖ్యలో ఉద్యోగులను తొలగించడం వల్ల నష్టాల నుండి బయటకు తేలేకపోయామన్న సాకుతో, బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటు భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించాలని ప్రయత్నిస్తోంది. బిఎస్ఎన్ఎల్‌లోని 2,76,000 మంది ఉద్యోగులలో దాదాపు లక్షమందిని విఆర్ఎస్ ఇవ్వాలని మేనేజ్‌మెంటు ప్రతిపాదిస్తోంది. ఉద్యోగులపై భారీస్థాయిలో మేనేజ్‌మెంటు దాడిని ఇది తెలియజేస్తోంది.

### 3. నిజానికి ఇది వాలంటరీ రిటైర్‌మెంటు పథకం కాదు - కంపల్సరీ రిటైర్‌మెంటు పథకం

లక్షమంది ఉద్యోగులకు విఆర్ఎస్ అమలుచేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలోనే, ఈ పథకం వాలంటరీ రిటైర్‌మెంటు కాదనీ, లక్షమంది అనే లక్ష్యం చేరేదాకా అవసరమైతే కంపల్సరీ రిటైర్‌మెంటు కూడా అమలుచేస్తారనీ తేటతెల్లమవుతోంది.

### 4. మరిన్ని దాడులు తప్పవు

విఆర్ఎస్ తీసుకున్న ఉద్యోగులతో ఏర్పడే కో-ఆపరేటివ్ సొసైటీలకు 5000 లోపు లైన్ల టెలిఫోను ఎక్ఛేంజీల నిర్వహణను అప్పగిస్తామని మేనేజ్‌మెంటు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే సర్వీసులో వున్న ఉద్యోగులకు తగిన పని వుంటుందా? ఆ తర్వాతి క్రమంలో మిగతా ఉద్యోగులను కూడా తొలగించే ప్రక్రియ కొనసాగుతుంది. నిజానికి 2,76,000 మంది ఉద్యోగులను ఎయిర్‌టెల్‌లో లాగా కేవలం 25,000 మంది ఉద్యోగులకు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం.

### 5. బిఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరించే కుట్ర

ఈ క్రింద పేర్కొన్న ఆర్థికపరమైన అంశాలను పరిశీలిస్తే, విఆర్ఎస్ అమలు బిఎస్ఎన్ఎల్ పైన, అందులోని ఉద్యోగుల పైన వ్యతిరేక ప్రభావం చూపిస్తుందని తేటతెల్లమవుతుంది. ఈ రకమైన భారీస్థాయి విఆర్ఎస్ వల్ల ఆర్థికంగా లాభదాయకం కాకపోగా, భారీసంఖ్యలో ఉద్యోగుల తొలగింపు బిఎస్ఎన్ఎల్ ప్రైవేటీకరణకు దారితీస్తుంది.

### 6. ఇప్పటికే నష్టాలలో వున్న బిఎస్ఎన్ఎల్‌కు విఆర్ఎస్ అమలు ఖర్చు అదనపు భారమే

అ) డిపిఇ ఉత్తర్వు నెం. 2(32)/97-డిపిపి(డబ్ల్యుసి)/జిఎల్-XXII, తేది 5 మే 2000 నాటి పేరా 8 ప్రకారం నష్టాలలో నడిచే లేదా కొద్దిపాటి లాభాలతో నడిచే ప్రభుత్వరంగ సంస్థలకు విఆర్ఎస్ అమలుకై ప్రభుత్వ బడ్జెట్ నుండి ఆర్థిక సహాయం లభిస్తుంది. అయితే ఆ ప్రభుత్వరంగ సంస్థలకు బ్యాంకులో క్రెడిట్ లేకుండా ఉంటేనే ఈ సహాయం లభిస్తుంది. లక్షమంది ఉద్యోగులకు విఆర్ఎస్

అమలు కోసం 18,181 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయబడింది. ఇందులో ఎక్స్‌గ్రేషియా కోసం 8,655 కోట్లు, పెన్షను కమ్యుటేషన్ కోసం 3,474 కోట్లు, గ్రాట్యుటీ కోసం 3,347 కోట్లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు కోసం 2,455 కోట్లు ఖర్చవుతాయి. పై పేర్కొన్న ఉత్తర్వుల ప్రకారం ఎక్స్‌గ్రేషియా కోసం ఖర్చయ్యే 8,655 కోట్లు ప్రభుత్వం ఇవ్వడం కుదరదు. కనుక ఈ మొత్తాన్ని ఏదైనా బ్యాంకులో బిఎస్ఎన్ఎల్ రుణంగా తీసుకోవాల్సి వుంటుంది. ఇది ఖచ్చితంగా బిఎస్ఎన్ఎల్‌కు అదనపు భారమే.

ఆ) బిఎస్ఎన్ఎల్‌గానీ, ఎంటిఎన్ఎల్‌గానీ లైసెన్సు ఫీజు, డివిడెండ్, కార్పొరేట్ టాక్సు, ఎక్సైజ్ డ్యూటీ మరియు సర్వీసు టాక్సుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించే మొత్తంలో 60% మాత్రమే పెన్షను ఖర్చుగా భరిస్తామనీ, 60% మించి పెన్షను ఖర్చు అయిన పక్షంలో, ఆ మొత్తాన్ని బిఎస్ఎన్ఎల్ భరించాల్సి వుంటుందనీ ప్రభుత్వం 2006లో ఉత్తర్వులు జారీ చేసింది. లక్షమంది ఉద్యోగులకు విఆర్ఎస్ అమలుచేయడం వల్ల భారీగా పెరిగే పెన్షను ఖర్చు 60% మొత్తాన్ని మించిపోవడం వల్ల బిఎస్ఎన్ఎల్‌కు అదనపు భారం పెరుగుతుంది.

ఈ రకంగా అదనపు ఖర్చులను భరిస్తూ, ముందే నష్టాలలో నడిచే బిఎస్ఎన్ఎల్‌లో లక్షమందికి విఆర్ఎస్ బలవంతంగా ఇవ్వడం మూర్ఖత్వమే.

## 7. విఆర్ఎస్ అమలు వల్ల వేతన బిల్లు తగ్గుతుందనుకోవడం భ్రమే

మేనేజ్‌మెంటు ప్రతిపాదించిన లక్షమంది ఉద్యోగులకు విఆర్ఎస్ వల్ల గుజరాత్ ప్రభుత్వ విధానం వలే అయితే బిఎస్ఎన్ఎల్‌కు దాదాపుగా 18181 కోట్లు ఖర్చవుతుంది. ఇలా వెంటనే లక్షమందిని ఉద్యోగాల నుండి తొలగించి 18181 కోట్లు ఖర్చు చేయడం వల్ల రాబోయే 15 సంవత్సరాలలో అంటే 2012 నుండి 2027 దాకా బిఎస్ఎన్ఎల్‌కు 35,266 కోట్లు ఆదా అవుతాయని అంచనా.

అయితే 18181 కోట్లు బ్యాంకులో డిపాజిట్ చేసి 10% వడ్డీని పొందగలిగితే రాబోయే 15 సంవత్సరాలలో బిఎస్ఎన్ఎల్‌కు దాదాపు 60,000 కోట్లు ఆదాయం వస్తుంది. అంటే విఆర్ఎస్ అమలువల్ల ఆదా అవుతుందనుకుంటున్న 35,266 కోట్లు కంటే, ఎంతో ఎక్కువ మొత్తాన్ని బిఎస్ఎన్ఎల్ సమకూర్చుకోవచ్చు. ఈ రకంగా విఆర్ఎస్ అమలువల్ల బిఎస్ఎన్ఎల్‌కు ఆదాయం పరంగా ఒరిగేదేమీ లేదు.

బిఎస్ఎన్ఎల్‌లో విఆర్ఎస్ అమలుకోసం ఒత్తిడి చేసే బదులు గ్రామీణ ప్రాంతాలలో నష్టాలను భరించి బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలకు పరిహారాన్ని ప్రభుత్వం చెల్లిస్తే తిరిగి లాభాలబాటలో బిఎస్ఎన్ఎల్ నడుస్తుంది.

## 8. విఆర్ఎస్ తీసుకున్న ఉద్యోగికి కలిగే నష్టాలు

అ) మేనేజ్‌మెంట్ అందజేసిన విఆర్ఎస్ ప్రతిపాదనలను పరిశీలిస్తే, 45 సంవత్సరాల వయస్సు నిండి ఎన్ఇ7 పే స్కేలులో 10వ స్టేజిలో వున్న ఉద్యోగికి విఆర్ఎస్ వల్ల వచ్చిన మొత్తాన్ని బ్యాంకులో వేసి, దానిపై వడ్డీ తీసుకుంటే మరియు పెన్షను మొత్తం కలిపితే నెలకురూ. 20,695 వస్తుంది. కానీ అదే ఉద్యోగి విఆర్ఎస్ తీసుకోకుండా ఉద్యోగంలో కొనసాగితే అతనికి బేసిక్ పే రూ. 14,680, డి.ఎ. రూ. 6923 + హెచ్ఆర్ఎ 30% - రూ. 4403 = మొత్తం రూ. 26,006 వస్తుంది. కనుక అతను విఆర్ఎస్ తీసుకుంటే రూ. 26006 - 20695 = రూ. 5311 నెలనెలా మొత్తం తగ్గుతుంది. అదే ఉద్యోగి 60 సంవత్సరాల వరకు ఉద్యోగంలో కొనసాగితే అతనికి 15 ఇంక్రిమెంట్లు మరియు ఒకటో, రెండో ప్రమోషన్లు వస్తాయి. కనుక అతను రాబోయే సర్వీసులో మరింత మొత్తాన్ని పొందగలుగుతాడు. ఇంతే కాకుండా అతని బేసిక్ పే 16 నుండి 17 ఇంక్రిమెంట్ల మేర పెరుగుతుంది. దీనివల్ల అతనికి వచ్చే పెన్షనరీ బెనిఫిట్లు కూడా గణనీయంగా పెరుగుతాయి. కనుక విఆర్ఎస్ తీసుకోవడం వల్ల ఉద్యోగికి ఎంతో నష్టం అన్న విషయం గ్రహించాలి.

ఆ) విఆర్ఎస్ వల్ల వచ్చే ఎక్స్‌గ్రేషియా మొత్తంలో 5 లక్షలు దాటిన మొత్తానికి 33% రేటు చొప్పున ఇన్‌కంటాక్స్ చెల్లించాలి. కనుక ఎక్స్‌గ్రేషియా మొత్తంలో దాదాపు మూడో వంతు ఆదాయపు పన్నుకే చెల్లించాల్సి వస్తుంది.

ఇ) **రిటైరైన తర్వాత కూడా విఆర్ఎస్ దాడి కొనసాగుతుంది:** భారీసంఖ్యలో బిఎస్ఎన్ఎల్‌తో విఆర్ఎస్ అమలు చేయడంలో ఉద్దేశ్యం బిఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరించడానికే. బిఎస్ఎన్ఎల్ ప్రైవేటీకరించబడితే రిటైరైన ఉద్యోగులకు మెడికల్ రీయంబర్స్‌మెంటు స్కీము వుండదు. అలాగే పెన్షను చెల్లింపుల కోసం ప్రైవేటు యాజమాన్యం ధనాన్ని వెచ్చించడం అనుమానమే.

పెన్షను చెల్లింపులు జరుగకపోయినా, పెన్షను చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, దాన్ని నమ్మలేం. గ్రామీణ ప్రాంత సర్వీసుల నష్టాలను, ఎడిసి ఛార్జీలను, లైసెన్సు ఫీజు మినహాయింపును బిఎస్ఎన్ఎల్‌కు కల్పిస్తామన్న ప్రభుత్వం ఆ తర్వాత మాట తప్పడం మనకు తెలుసు.

ఇలా బిఎస్ఎన్ఎల్ సంస్థకుగానీ, ఉద్యోగులకుగానీ ఎలాంటి ప్రయోజనం లేని విఆర్ఎస్ పథకం అమలుని తక్షణం ఉపసంహరించాలి.

## బిఎస్ఎన్ఎల్‌ను లాభాలలో నడిచే ప్రభుత్వరంగ సంస్థగా చేయడానికి ప్రత్యామ్నాయాలు

1. బిఎస్ఎన్ఎల్ ఆదాయం 2011-12 సంవత్సరానికి గత సంవత్సరంతో పోలిస్తే 25% మేర పెంచుకోవాలని డిఓటి లక్ష్యాలు నిర్దేశించింది. 2010-11 సంవత్సరంలో సర్వీసులపై బిఎస్ఎన్ఎల్ ఆదాయం 27,000 కోట్లుగా వుంది. లక్ష్యాలను చేరుకొన్నట్లుగా భావించి, బిఎస్ఎన్ఎల్ ఆదాయం 2011-12 సంవత్సరంలో 25% పెరిగితే రూ. 33,750 కోట్లు వస్తుంది. 2011-12 సంవత్సరంలో బిఆర్‌పిఎస్ఇ అంచనా ప్రకారం బిఎస్ఎన్ఎల్ వ్యయం రూ. 37,000 కోట్లు. అంటే 2010-11 సంవత్సరంలోని రూ. 6384 కోట్ల నష్టంతో పోలిస్తే, 2011-12 సంవత్సరంలో నష్టం రూ. 3250 కోట్లుగా వుంటుంది.

2. సామాజిక బాధ్యతగా గ్రామీణ ప్రాంత సర్వీసులను నిర్వహించడం వల్ల బిఎస్ఎన్ఎల్‌కు వస్తున్న నష్టం ఏటా 10,000 కోట్లు. బిఎస్ఎన్ఎల్ ఏర్పడేటప్పుడు గ్రామీణ ప్రాంత సర్వీసుల నష్టాలను భరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. 2005-06 సంవత్సరంలో బిఎస్ఎన్ఎల్‌కు ఎడిసి ఛార్జీల రూపంలో ప్రైవేటు టెలికం కంపెనీల నుండి 5000 కోట్లు, లైసెన్సు ఫీజు, స్పెక్ట్రమ్ ఛార్జీల మాఫీ రూపేణా 3000 కోట్లు మొత్తం 8000 కోట్లు లభించాయి. భారత అమెరికా బడా పెట్టుబడిదారుల ఫోరం ఒత్తిడి మేరకు ప్రైవేటు టెలికం కంపెనీలకు లాభం చేకూర్చడానికి, గ్రామీణ ప్రాంత నష్టాల కాంపెన్సేషన్ 2000 కోట్లకు తగ్గించబడి, ప్రస్తుతం నిలిపివేయబడింది. ఈ కాంపెన్సేషన్ చెల్లింపు కోసం మేనేజ్‌మెంటు ప్రయత్నిస్తున్నా ప్రభుత్వం చెల్లించడానికి నిరాకరిస్తోంది. ఒకవేళ ఈ మొత్తం ప్రభుత్వం చెల్లిస్తే బిఎస్ఎన్ఎల్ నష్టం 2011-12 సంవత్సరానికి రూ. 3250-2000 = 1250 కోట్లుకు తగ్గుతుంది. అలా కాకుండా గ్రామీణ ప్రాంత సేవల వల్ల బిఎస్ఎన్ఎల్‌కు వస్తున్న నష్టం 10000 కోట్లను పూర్తిగా భరిస్తే బిఎస్ఎన్ఎల్ లాభాలలో నడుస్తుంది. ఇదే విధంగా ఇతర సామాజిక సేవలను నిర్వహిస్తున్న బిఎస్ఎన్ఎల్ సేవలు (టెలిగ్రాఫ్ సిస్టమ్, 3జి సర్వీసులు, బిడబ్ల్యుఎ సర్వీసులు)లకు కూడా పరిహారం ప్రభుత్వమే చెల్లించాల్సి వుంది.

3. బిఎస్ఎన్ఎల్ మార్కెట్ షేరును పెంపొందించడానికి, సకాలంలో పరికరాలను సమకూర్చుకోవడానికి బిఎస్ఎన్ఎల్ మేనేజ్‌మెంటు పెంపు లక్ష్యాన్ని కూడా సాధించేందుకు మేనేజ్‌మెంటు ప్రయత్నించాలి. గ్రామీణ ప్రాంత సేవల నష్టాల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించేందుకు ఒత్తిడి చేయాలి.

ఇందుకోసం బిఎస్ఎన్ఎల్‌లోని అందరు అధికారులూ, నాన్ ఎగ్జిక్యూటివ్స్ కలిసికట్టుగా ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు బిఎస్ఎన్ఎల్‌ను లాభాలబాటలో నడిపేందుకు, తగిన విధానాల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# 10-10-2011 నాటి ఒకరోజు సమ్మెను విజయవంతం చేయండి!!

| | | |
|---|---|---|
| **BSNLMS** | **BTEU-BSNL** | **AIBSNLEA** |
| **SNEA(I)** | **BSNLEU** | **SEWA** |